క్లుప్తంగా

ఘనంగా పాస్టర్ల దినోత్సవం



పాస్టర్ రాజును సన్మానిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రపంచ పాస్టర్ల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. యునైటెడ్ ప్రేయర్ హౌస్ పాస్టర్ రాజును ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ రెండో ఆదివారం పాస్టర్ల దినోత్సవంగా జరుపుతారని, క్రైస్తవ చర్చి సంఘంలో బహుముఖ పాత్రను పోషించే మతపరమైన వ్యక్తి పాస్టర్ అని విశదీకరించారు. బైబిల్ వంటి మతపరమైన గ్రంథాలను సమాజానికి వివరించడం పాస్టర్ల విధి అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, ప్రసాద్ నాయుడు, శ్రీనగేష్, కుమార్ యాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు ఆదినారాయణ

కాకినాడ రూరల్: ప్రపంచ థ్రాంబోసిస్ డే పురస్కరించుకుని కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గుండె వ్యాధులపై అప్రమత్తత అవసరమని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు ఆదినారాయణ అన్నారు. ఐడీఏ రాష్ట్ర కన్వీనర్ డాక్టరు అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఆదినారాయణ మాట్లాడుతూ, రక్త నాళంలో రక్తం గడ్డ కట్టడాన్ని థ్రాంబోసిస్ అంటారన్నారు. దీనిని తగ్గించడానికి ప్రజలు వ్యాయామం విధిగా చేయాలన్నారు. తగ్గిన చలనశీలత రక్తం గడ్డ కట్టే ప్రమాదాన్ని పెంచుతుందని, అనారోగ్యం , మరణాలకు ముఖ్య కారణమవుతుందన్నారు. ఏటా అక్టోబరు 13న వరల్డ్ థ్రాంబోసిస్ డే జరుపుతారన్నారు. ఈ ఏడాది థీమ్ మూవ్ ఎగైనెస్ట్ థ్రాంబోసిస్ అన్నారు. కార్యక్రమంలో వైద్యులు నాగేంద్ర, చైతన్య తదితరులు పాల్గొన్నారు.


మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కాకినాడ క్రైం: మద్యం దుకాణాల నుంచి సాధారణ ధరలకు కొని, అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు తెలిపిన వివరాల మేరకు, స్థానిక రిక్షాలపేటకు చెందిన పెసంగి గంగాధర్ కొంత కాలంగా పలువురితో మద్యం సీసాలు కొనిపిస్తూ, వాటిని అధిక ధరకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడి నివాసాన్ని తనిఖీ చేసి, 70 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిని అనధికారికంగా విక్రయిస్తున్నట్టు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కమిషనర్ భావన ఆదివారం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్‌లో ఫోన్ ద్వారా సమస్యలు నమోదు చేసుకుంటారన్నారు. అనంతరం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి నేరుగా సమస్యలు, వినతులు స్వీకరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:
విశ్వం, వేట్టయాన్, దేవర, జనక అయితే గనక
దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్:
దేవర, వేట్టయాన్, మా నాన్న సూపర్ హీరో
లక్ష్మి: దేవర
సత్యగౌరి: మా నాన్న సూపర్ హీరో
తిరుమల: వేట్టయాన్
సీఅండ్‌సీ1: జనక అయితే గనక
సీఅండ్‌సీ2: శ్వాగ్
శ్రీప్రియ: మార్టిన్
పద్మప్రియ: దేవర
సూర్య (వాకలపూడి): దేవర
సూర్య2: విశ్వం

డ్రైనేజీ కహానీ

- పూడికలతో నిండిపోయిన మురుగు కాలువలు
- దుర్వాసనతో ప్రజానీకానికి తప్పని అవస్థలు
- పాదచారులు ముక్కు మూసుకోవాల్సిందే..
- నెలల తరబడి పూడికలు తీయని వైనం
- నగరపాలక సంస్థలో పాతుకుపోయిన నిర్లక్ష్యం



భగవతి మార్గ్‌లోని ఓ వీధిలో పూడికతో నిండిఉన్న డ్రైనేజీ



విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులో డ్రైనేజీ దుస్థితి

బోట్‌క్లబ్: నగరంలో ఏ డ్రైనేజీ చూసినా నిండుకుండలా కనిపిస్తోంది. ఇంటిలోని మురుగునీరు పోయే దారిలేక కొన్ని ప్రాంతాల్లో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి డ్రైనేజీలో పేరుకున్న పూడికలు తీయడం లేదు. దీంతో మురుగునీరు కూడా డ్రైనేజీలో ప్రవహించే పరిస్థితి లేదు. ఆయా ప్రాంతాల ప్రజలు నిత్యం దుర్గంధపూరిత వాతావరణం, దుర్వాసనల మధ్య జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

గతంలో రెండు, మూడు రోజులకు ఒకసారి పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీలో సిల్ట్ తీసేవారు ప్రస్తుతం నెలల తరబడి డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో. అవి నిండిపోయి, దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆ రోడ్డుపై వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాకినాడ కార్పొరేషన్‌లో వెయ్యి మందికి పైగా పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ డ్రైనేజీలు మాత్రం శుభ్రం చేయడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో దోమల ఉధృతి కారణంగా ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కార్పొరేషన్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్న ప్రాంతాల్లో మాత్రం పారిశుధ్య సిబ్బంది నిత్యం రోడ్లు శుభ్రం చేసి, డ్రైనేజీల్లో చెత్తాచెదారం తొలగిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం అసలు పట్టించుకోవడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు.

ఇక్కడ మరీ అధ్వానం

స్థానిక ఒకటో డివిజన్‌లోని బోట్ క్లబ్ పార్కు ఎదురుగా ఉన్న వీధిలో రెండు నెలల నుంచి అసలు డ్రైనేజీని శుభ్రం చేయలేదు. స్థానిక విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులోని డ్రైనేజీని గత నెల రోజులుగా పట్టించుకోలేదు. దీంతో డ్రైనేజీలో మురుగునీరు కూడా పోయేదారి లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో వారానికి ఒకసారి తప్పనిసరిగా డ్రైనేజీలో పేరుకున్న చెత్తాచెదారం తీయడంతో, ఇళ్లల్లోని మురుగునీరు సులువుగా పోయేది. ప్రస్తుతం నెలల తరబడి డ్రైనేజీ శుభ్రం చేయకపోవడంతో, అవి నిండుకుండలా మారాయి.

రాత్రుళ్లు దోమలతో అవస్థలు

చీకటిపడితే చాలు దోమలు నిత్యం ఇళ్లలోకి వచ్చి ప్రజలను నిద్రపోకుండా చేస్తున్నాయి. డ్రైనేజీలు చాలా అధ్వానంగా ఉండడంతో అవి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా, ఆవాసాలుగా మారాయి. దీంతో చీకటిపడితే ఇంటి తలుపులు తీయాలంటే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పొరబాటున ఇంటి తలుపులు తెరిస్తే దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో హాయిగా నిద్రపోదామన్నా, దోమలు పడుకోనివ్వడం లేదని స్థానిక విద్యుత్‌నగర్, భగవతి మార్గ్, నాన్సీస్ట్రీట్ ప్రజలు వాపోతున్నారు. గతంలో దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలు వినియోగించేవారు. ప్రస్తుతం ఎక్కడా ఫాగింగ్ చేయడం లేదని, అందుకే రోజురోజుకూ దోమలు పెరిగిపోన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ప్రతి రోజు పారిశుధ్య సిబ్బందికి కొన్ని వీధులు శుభ్రం చేసే విధంగా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు కేటాయిస్తారు. కొందరు సిబ్బంది విధులకు వచ్చి, శుభ్రం చేస్తున్నట్టు ఫొటో తీసి అధికారులకు అప్‌లోడ్ చేసి, తమ సొంత పనులకు వెళ్లిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

వర్షం వస్తే రోడ్డుపైనే..

డ్రైనేజీల్లో పూడికలు పేరుకుపోవడంతో, వర్షం వస్తే డ్రైనేజీల నుంచి వర్షపు నీరు పోయే పరిస్థితి లేదు. దీంతో రోడ్డుపైనే వర్షపు నీరు ఉండిపోవడంతో, దహదారులు సెలయేరుల్లా మారుతున్నాయి. వర్షం వస్తే మురుగునీరు, వర్షపునీరు కలిసి రోడ్డుపైన చేరడంతో, వాటిపై ప్రయాణించాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వర్షం వస్తే నగర ప్రజలు భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

సిబ్బంది పట్టించుకోవడం లేదు



మా వీధిలో డ్రైనేజీ శుభ్రం చేసి సుమారు నెల రోజులు కావస్తోంది. డ్రైనేజీలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో మురుగునీరు పారడం లేదు. పారిశుధ్య సిబ్బంది బాగా ఉన్న రోడ్లను శుభ్రం చేసి వెళుతున్నారు మినహా, డ్రైనేజీల్లో చెత్తా చెదారం తీయడం లేదు. డ్రైనేజీల్లో చెత్తను తీయమంటే, ఇంకా చాలా వీధులు శుభ్రం చేయాలని, ఖాళీ లేదని సమాధానం ఇస్తున్నారు.

– ఈ.సుబ్బారావు, విద్యుత్‌నగర్

దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



డ్రైనేజీలు అధ్వానంగా ఉండడంతో దోమల ఉధృతి ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో దోమలు ఎక్కువగా రావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అసలు నిద్ర ఉండడం లేదు. దోమల నియంత్రణకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– టి.లక్ష్మి, భగవతి మార్గ్

భక్తులకు అమ్మవార్ల దర్శనం



బాలాత్రిపురసుందరి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు



రాజరాజేశ్వరి అలంకరణలో అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో అమ్మవారు

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా శనివారం స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ కమిటీ కార్యదర్శి ఎస్ సాయిబాబా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు. అమ్మవారికి జమ్మిపత్రితో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

ఇజ్రాయెల్ మారణకాండను ఆపాలి

అఖిలపక్ష సమావేశంలో నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న శేషుబాబ్జీ

కాకినాడ సిటీ: ఇజ్రాయెల్ సైన్యానికి ఆయుధాల సరఫరాను భారత్ నిలిపివేయాలని, అలీన విదేశాంగ విధానానికి భారత్ కట్టుబడి ఉండాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయేలు మారణకాండను ఆపాలన్నారు. 196 దేశాల ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని అమెరికా, ఇజ్రాయెల్ ప్రభుత్వాలు ఆమోదించి, తక్షణం శాంతిని నెలకొల్పాలని కోరారు. సీఐటీయూ కాకినాడ కార్యాలయంలో ఆదివారం దువ్వా శేషుబాబ్జీ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. పలువురు నాయకులు మాట్లాడుతూ, హమాస్‌ను తుడిచి పెడతామంటూ పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించి, ఏడాది పూర్తి కావొస్తుందని, ఆస్పత్రులపై, శరణార్థి శిబిరాలపై, పాఠశాలలపై ఇజ్రాయెల్ సైన్యం బాంబులు వేయడంతో 12 వేల మంది పాలస్తీనా పౌరులు ఇప్పటి వరకు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్, లెబనాన్ భూభాగాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడి చేయడంతో పశ్చిమాసియా ప్రాంతం అట్టుడుకుతోందన్నారు. దీని ప్రభావం కచ్చితంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై, భారత ప్రజలపై ధరల పెరుగుదల రూపంలో తీవ్రంగా పడుతుందన్నారు. భారత ప్రభుత్వం అధికారికంగా పాలస్తీనా ప్రజలపై సానుభూతిని వ్యక్తం చేస్తూనే, అనధికారికంగా ఆయుధాలను ఇజ్రాయెల్ సైన్యానికి చేరవేస్తున్న విషయం స్పానిష్ సముద్ర జలాల్లో చెన్నై నుంచి బయలుదేరిన ఓడను అడ్డుకోవడంతో బయటపడిందన్నారు. ప్రపంచశాంతికి కట్టుబడి ఉన్న భారతదేశ గౌరవానికి భంగం వాటిల్లుతుందని, అలీన విదేశాంగ విధానానికి కట్టుబడి ఉండాలని అఖిలపక్షం సూచించింది. ఈ సమావేశంలో అఖిల పక్షం నాయకులు దూసర్లపూడి రమణరాజు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, జె వెంకటేశ్వర్లు, పీఎస్ నారాయణ, తాళ్లూరి రాజు, బాబీ, వాసు, చెక్కల రాజ్‌కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, మలకా రమణ, రాజబాబు, ఇబ్రహీం, నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, చంద్రావతి, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం

కాకినాడ సిటీ: ప్రముఖ విద్యావేత్త, పౌరహక్కుల నేత ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా మృతికి సీపీఎం జిల్లా కమిటీ ఆదివారం ప్రగాఢ సంతాం వ్యక్తం చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి చెందిన నాగ సాయిబాబా భౌతికంగా నడవలేని స్థితిలో చక్రాల కుర్చీకే పరిమితమై ఉండగా టెర్రరిస్టు నెపంతో దీర్ఘకాలం చేయని నేరానికి జైలులో మగ్గిపోయారన్నారు. బెయిల్‌పై విడుదలైన కొద్ది నెలలకే మరణించడం దురదృష్టకరమని సీపీఎం నాయకులు విచారం వ్యక్తం చేశారు. అర్బన్ నక్సల్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక వాదులను, మేధావులను వేధించడం తక్షణం నిలిపివేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందని జిల్లా కన్వీనర్ రాజశేఖర్ అన్నారు.

పౌర సంఘం సంతాపం

సామాజిక, పౌర హక్కుల యోధుడు, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ గోరకకొండ నాగసాయిబాబా మృతి ప్రజాస్వామ్య అణచివేతకు జరిగిన అసాధారణ దుస్సంఘటనగా సామాజికవేత్త, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు వ్యాఖ్యానించారు. బాల్యం నుంచి తీవ్రమైన వైకల్యంతోనే జీవితాన్ని ఎదురొడ్డి పోరాడుతూ, ఉన్నత విద్య చదివి ఢిల్లీ యూనివర్సిటీ ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా వేల మంది విద్యార్థులకు అత్యుత్తమ భవిష్యత్తు అందించిన ప్రజ్ఞాశాలి నాగసాయిబాబా అని కొనియాడారు. ఈయన మృతికి పౌర సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తుందన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన




నృత్య ప్రదర్శన ఇస్తున్న ముళ్లపూడి విజయలక్ష్మి బృందం

కాకినాడ రూరల్: దసరా సంబరాలు స్థానిక బీచ్ రోడ్డులోని శిల్పారామంలో శనివారం ఘనంగా జరిగాయి. సంస్కృతి, సంప్రదాయాల సమాహారంగా నిలిచే శిల్పారామంలో శ్రీసీతారత్న లలిత కళా నికేతన్‌కు చెందిన ముళ్లపూడి విజయలక్ష్మి బృందం నృత్య ప్రదర్శనతో అలరించారు. బీచ్‌కు వచ్చిన వారు శిల్పారామంలో నృత్య ప్రదర్శను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ మోహన్‌తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

మిన్నంటిన దసరా సంబరాలు




కరప దసరా సంబరంలో ఊరేగిస్తున్న ఏనుగు వాహనం



విద్యుద్దీపాల అలంకరణలో హంస వాహనం



ఎదురెదురుగా ఉన్న ఏనుగు, హంస వాహనాలు



కరపలో శమీపూజ చేస్తున్న దేవు వంశీకుడు శ్రీకర సూర్య



కొంగోడులో గ్రామ దేవతకు పూజలు చేస్తున్న పుట్టింటివారు

- ఆకట్టుకున్న కరప ఏనుగుల సంబరం
- ముగిసిన శరన్నవరాత్ర ఉత్సవాలు

కరప: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన శరన్నవరాత్ర ఉత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా రేయింబవళ్లు కరపలో నిర్వహించిన దసరా సంబరం అంబరాన్నంటింది. ముందుగా గ్రామంలోని దుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఉంచి బ్యాండ్‌మేళం, బాణసంచా కాల్పులతో గ్రామంలో ఊరేగించారు. గ్రామంలోని కొత్తపేట, మెరకవీధి, పల్లపువీధి, సీతమ్మవీధి, నీలయ్యతోట, రామకంచిరాజు నగర్ కాలనీ,, బీసీ వీధులు, ఎస్సీకాలనీ వారు సంయుక్తంగా ఏనుగు, హంస వాహనాలను తయారు చేసి, వాటిని కాగిత పూలు, వివిధ రకాల బొమ్మలు, రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఒక్కొక్క వాహనం ముందు బ్యాండు మేళం, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో రాత్రి, తెల్లవార్లూ గ్రామంలో ఊరేగిస్తూ సంబరం జరిపారు. తెల్లవారుజామున ఏనుగు, హంస వాహనాలను ఎదురెదురుగా ఉంచి, జమ్మిపత్రితో శమీపూజ చేశారు. దుర్గాదేవిని గ్రామంలో ఊరేగించి, విజయ దశమి రోజున నిర్వహించే సంబరంలో శమీపూజ చేస్తే పాడిపంటలు వృద్ధి చెంది, గ్రామం సుభిక్షంగా ఉంటుందని ప్రజల విశ్వాసం.

తరలివచ్చిన జనం

జిల్లా నలుమూలల నుంచి జనం తరలివచ్చి కరప దసరా సంబరాన్ని తిలకించారు. చిరు వ్యాపారులకు దండిగా వ్యాపారం జరిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప ఎస్సై టి.సునీత, గొల్లపాలెం, కోరంగి, ఇంద్రపాలెం, సర్పవరం పోలీసుస్టేషన్ల సిబ్బంది, ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారికి గ్రామోత్సవం

కరప శివారు రామకంచిరాజునగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయం వద్ద శరన్నవరాత్ర ఉత్సవాలు ముగింపు సందర్భంగా పూజాదికాలు నిర్వహించారు. అమ్మవారిని పల్లకీలో ఉంచి బ్యాండుమేళాలతో ఊరేగించి, గ్రామోత్సవం నిర్వహించారు. నడకుదురులో దుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని గ్రామంలో బ్యాండు మేళాలు, బాణసంచా కాల్పులతో ఊరేగించి, గ్రామోత్సవం నిర్వహించారు. శివాలయంలోని రామలింగేశ్వరస్వామి సమేత భ్రమరాంబదేవిని స్వర్ణ కవచాలంకారంలో అలంకరించారు. ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యండమూరులోని పురాతన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం శమీపూజ చేశారు. కరప, వలసపాకల, పెనుగుదురు, కొరుపల్లి, నడకుదురు తదితర గ్రామాల్లో భవానీలు దుర్గాదేవి ఆలయాల్లో పూజలు చేసి, ఇడిముడులు కట్టించుకున్నారు. విజయవాడ వెళ్లి, దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని, దీక్షను విరమించారు. కొంగోడులో గ్రామదేవత ధనమహాలక్ష్మి ఆలయంలో పుట్టింటివారి తరపున మేడిశెట్టి చిరంజీవి చక్రవర్తి దంపతులు విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అర్చకుడు పెద్దింటి సీతారామం శమీపూజ చేశారు.

వేంకటేశ్వర స్వామికి జన్మ నక్షత్ర పూజలు



యండమూరులో వేంకటేశ్వర స్వామికి జన్మ నక్షత్ర పూజలు, వ్రతాలు చేస్తున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

కరప: యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి జన్మ నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామం పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వేంకటేశ్వరస్వామి వ్రతాలు నిర్వహించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, వ్రతాల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. చినకొత్తూరు గ్రామానికి చెందిన చోడిశెట్టి చంటి దంపతులు భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కరప విష్ణాలయంలోని వేంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, కొంగోడు, వేళంగి తదితర గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి జన్మ నక్షత్ర పూజలు నిర్వహించారు.